క్లుప్తంగా

పులి కాదు.. హైనా!



దుగ్గొండి : పంటచేనులో పులి పాదముద్రలు ఉన్నాయని అన్నదాతలు ఆందోళన చెందడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలంలో పాదముద్రలు పరిశీలించారు. వివరాలిలా ఉన్నాయి... రెండు రోజుల క్రితం మండలం తొగరురామయ్యపల్లి గ్రామంలో యువరైతు పల్లె శ్యాంకుమార్ తన మొక్కజొన్న చేనుకు నీరు పారించారు. గురువారం ఉదయం వ్యవసాయ బావివద్దకు వెళ్లగా అక్కడ గట్టు పక్కన కాల్వలో పాదముద్రలు కనిపించడంతో ఎస్సై వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఎస్సై, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సోమతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అవి డాగ్ జాతికి చెందిన హైనా జంతువు పాదముద్రలని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి భయం లేకుండా వ్యవసాయ పనులు చేసుకోవచ్చన్నారు.

108 అంబులెన్స్‌లో తనిఖీ



దుగ్గొండి : మండల కేంద్రంలోని 108 వాహనాన్ని జిల్లా అధికారి రాజ్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆక్సీజన్ లభ్యతపై సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ నర్సింగం, పైలట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

నర్సంపేట రూరల్ : నర్సంపేట పరిధిలోని ద్వారకపేటలోని ఆకుల సరోజన ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. దొంగలు రూ.20 వేల నగదు, 27 తులాల వెండి అపహరించారు. వివరాలిలా.. ద్వారకపేటలోని 6వ వార్డుకు చెందిన సరోజన కూలీ పని చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె నాటు వేసేందుకు ఉదయం కూలీ పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చాక తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్ కింద ఉన్న నగదుతోపాటు వెండి పట్టిలు, మట్టెలు కనిపించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఇద్దరిపై కేసు

సంగెం : మండలంలోని వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ రాజుపై ఇటుకతో దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వివరాలిలా.. ఈనెల 26న తన ఇంటి వద్ద ఇటుకలను ఎవరో ఎత్తుకెళ్లారని రాజు తన భార్యతో చెబుతుండగా పక్కింట్లో ఉంటున్న రవీందర్, దేవేందర్ గొడవకు దిగారు. రాజును బూతులు తిడుతూ ఇటుకతో దాడి చేసి గాయపర్చారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని శాయంపేటకు చెందిన సముద్రాల శ్రవణ్ ఇటీవల కోరుట్లలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆయనకు ప్రముఖ ప్రజాసేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సతీమణి స్వప్నదేవి గురువారం రూ.20 వేల సాయం అందజేశారు. అనంతరం మనుగొండకు చెందిన కొల్లూరి హైమావతి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు స్వప్న దేవి రూ.15 వేల సాయం అందజేశారు. ఇద్దరినీ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు అల్లం మల్రెడ్డి, వీరగొని రాజ్‌కుమార్, బొడిగె శోభన్‌బాబు, కందికొండ రాజ్‌కుమార్, సముద్రాల సతీశ్, పోరండ్ల రాజు, చల్ల నాగరాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో..



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జక్కుల కొమురయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు ఈదులకంటి మహిపాల్‌రెడ్డి గురువారం రూ.5 వేల సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పరుపాటి రాజేందర్‌రెడ్డి, సంది మహేందర్‌రెడ్డి, బైరి రమేశ్, దుండి అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయోమయం.. పాత ముగ్దుంపురం..

- గురిజాల ఎంపీటీసీ పరిధిలోకి..
- చెన్నారావుపేటలో కలపాలని డిమాండ్

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండల కేంద్రానికి అనుకుని ఉన్న పాత ముగ్దుంపురం గ్రామాన్ని నర్సంపేట మండలంలో కలిపిన విషయం తెలిసిందే. సమీపంలో ఉన్న చెన్నారావుపేటలోనే కలపాలని కోరుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఏడాది క్రితం చెన్నారావుపేటలో కలుపుతున్నట్లు ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ ఇచ్చినా సదరు ప్రక్రియ పూర్తి కాలేదు. గతంలో ముగ్దుంపురం రెవెన్యూ కింద ఉన్న పాత ముగ్దుంపురం గ్రామాన్ని డీలిమిటేషన్‌లో గురిజాల ఎంపీటీసీ పరిధిలో కలుపుతూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో ప్రజలు అయోమయంలో పడిపోయారు.

నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండలంలోని గురిజాల, జీజీఆర్‌పల్లి, ముగ్దుంపురం, పాత ముగ్దుంపురం గ్రామాలను 2018లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సంపేట మండలంలో కలిపింది. 2011 లెక్కల ప్రకారంపాత ముగ్దుంపురంలో 1054 మంది జనాభా. పురుషులు 528, స్త్రీలు 526 మంది ఉన్నారు. పాత ముగ్దుంపురం చెన్నారావుపేటకు పక్కనే ఉండడంతో గ్రామస్తులు చెన్నారావుపేట మండలంలోనే కలపాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. దీంతో గతేడాది పాత ముగ్దుంపురంను చెన్నారావుపేట మండలంలో కలుపుతున్నట్లు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ ప్రక్రియ అక్కడికే పరిమితం అయ్యింది. నోటిఫికేషన్ రావడంతో చెన్నారావుపేట మండలంలోని పాత ముగ్దుంపురం కలిసిందని ప్రజలు అనుకున్నారు. ఇటీవల ఎంపీటీసీ పరిధి నర్సంపేట మండలంలో ఉన్నట్లు రావడంతో ప్రజలు చెన్నారావుపేట మండలంలోనే ఉంచాలంటూ ఆర్డీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. పాత ముగ్దుంపురంను నర్సంపేట మండలంలో కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో ప్రజలు మళ్లీ అయోమయంలో పడిపోయారు.



పాత ముగ్దుంపురం గ్రామ పంచాయతీ భవనం

గురిజాల ఎంపీటీసీ పరిధిలోనే..

నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం రెవెన్యూ కింద పాత ముగ్దుంపురం ఉండేది. ముగ్దుంపురం ఎంపీటీసీ పరిధిలోనే పాత ముగ్దుంపురం కొనసాగింది. నర్సంపేట మండలంలోని 8 గ్రామాలను ఇటీవల మున్సిపాలిటీలో విలీనం చేయగా ముగ్దుంపురం సైతం కలిసిపోయింది. ముగ్దుంపురం పరిధిలోని ఎంపీటీసీ స్థానం కిందే పాత ముగ్దుంపురం గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీ పరిధిలో కలుపుతూ ఇటీవల వచ్చిన డీలిమిటేషన్ పంచాయతీరాజ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గురిజాలలో ఇప్పటికే సుమారు ఏడు వేలకుపైగా జనాభా ఉండగా గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి, చిన్న గురిజాల కూడా ఎంపీటీసీ పరిధిలో ఉన్నాయి. గురిజాల ఎంపీటీసీని రెండుగా విభజించాలని పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చారు. వీటిని విలీనం చేయకుండానే పాత ముగ్దుంపురంను సైతం గురిజాల ఎంపీటీసీ పరిధిలోకి తీసుకొస్తుండడంతో ప్రజల వ్యతిరేకిస్తున్నారు. అవసరమైతే ప్రత్యేకంగా పాత ముగ్దుంపురం గ్రామానికి ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించాలన్న డిమాండ్ వెల్లువెత్తుతోంది. లేనిపక్షంలో చెన్నారావుపేట మండలంలో విలీనం చేయాలని కోరుతున్నారు. గురిజాల ఎంపీటీసీ పరిధిలోకి కలపడంతో తాము ఇబ్బందులు పడక తప్పదని ప్రజలు వాపోతున్నారు.

నోటిఫికేషన్ మాత్రమే..



పాత ముగ్దుంపురం గ్రామాన్ని నర్సంపేట మండలం నుంచి చెన్నారావుపేట మండలంలో కలుపుతూ నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. పూర్తి స్థాయిలో ప్రక్రియ కొనసాగలేదు. ఈ క్రమంలో పాత ముగ్దుంపురం నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం రెవెన్యూ గ్రామం కిందే కొనసాగుతోంది.

– రాజేశ్, తహసీల్దార్, నర్సంపేట

నర్సంపేట మండలంలోనే..



నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంను మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల జీఓ జారీ చేసింది. దీంతో పాత ముగ్దుంపురంను గురిజాల పరిధిలో కలపాల్సి వచ్చింది. ఈ క్రమంలో ముగ్దుంపురం పరిధిలోని పాత ముగ్దుంపురం నర్సంపేట మండలంలోనే కొనసాగుతోంది.

– శ్రీనివాసరావు, ఎంపీడీఓ, నర్సంపేట

ఘనంగా శివపార్వతుల కల్యాణం



నల్లబెల్లి: ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకుడు, కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఇతరులు



సంగెం : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నల్లబెల్లి : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగించగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గందె శ్రీనివాస్, కోశాధికారి ప్రమోద్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పురాం భద్రీనాద్, ప్రసాద దాత గుగ్గిళ్ల శ్రీనివాస్, పడాల మురళి, పాండవుల రాంబాబు, ముత్యాల కుమార్, మేడిపల్లి రాజుగౌడ్, పురం సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సంఘమేశ్వరాలయంలో..

సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వరాలయంలో సంఘమేశ్వరస్వామి, గంగాభవానీ పార్వతి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు అప్పె నాగేంద్రస్వామి, నాగార్జున శర్మ, పాకాల భానుమూర్తి శర్మ, సత్యనారాయణ శర్మ, సాయి చందు వేద మంత్రోచ్చరణల నడుమ కనుల పండువగా నిర్వహించారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



పర్వతగిరి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌నాయక్

పర్వతగిరి : మహాశివరాత్రి సందర్భంగా ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో పర్వతగిరి టీమ్ జఫర్‌గడ్ టీమ్‌పై విజయం సాధించింది. ఈ సందర్భంగా పర్వతగిరి టీమ్‌కు జాటోతు చైతన్యనాయక్ జ్ఞాపకార్థం రూ.10 వేల నగదుతోపాటు మెమోంటోనూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ అందజేశారు. అలాగూ జఫర్‌గడ్ జట్టుకు రెండో బహుమతిగా రూ.5 వేల నగదు తోపాటు మెమోంటోను యూత్ ఆధ్వర్యంలో అందించగా పంథిని టీమ్‌కు మూడో బహుమతిగా రూ.2 వేల నగదుతోపాటు మెమోంటోను ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భానోతు భాస్కర్‌నాయక్ అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కూసం రాంచందర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుగా ఎర్రం సిద్దార్థ్‌కు రూ.500 నగదు అందించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర సుధాకర్, వంగ సాయికృష్ణ, కొమ్ము రమేశ్, జంగా సారంగపాణి, మురళి, శ్రీశైలం, గరుగు రాజు, శ్రీకాంత్, భాస్కర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రోళ్లకల్‌లో..

మండలంలోని రోళ్లకల్‌లోని శంభుని గుడిలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నాగపురి సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు చైర్మన్ నాగపురి రాజా బహుమతులు అందజేశారు. మూడు దేవి, సంకినేని లలిత, మడ్డి అక్షయ, మూడు సుష్మిత, గాజుల హన్సిక, మూడు అఖిల్ మొదటి బహుమతి అందుకోగా మడ్డి దీక్ష, మూడు అర్చన, బొమ్మెర అశ్విని, గుగులోతు శాంతి, మడ్డి శారద, భానోతు అనిల్ ద్వితీయ బహుమతి బహుమతులు సాధించారు. విజేతలను చైర్మన్ రాజా అభినందించారు.

కూల్‌డ్రింక్స్ ఏజెన్సీలో అధికారుల తనిఖీ

- పానీయాలు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : మండల కేంద్రంలోని పద్మావతి కూల్‌డ్రింక్స్ ఏజెన్సీలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి గురువారం తనిఖీ చేశారు. 'గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు' శీర్షికతో ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉద్యోగులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సుమారు ఏడాదికిపైగా గడువు తీరిన కూల్‌డ్రింక్స్ నిల్వలున్నట్లు గుర్తించారు. సుమారు రూ.69 వేల విలువైన వివిధ రకాల గడువు తీరిన శీతల పానీయాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఆర్నెళ్లకుపైగా కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నడుస్తుండగా ప్రభుత్వ అనుమతి లేనట్లు అధికారులు నిర్ధారించారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని కృష్ణమూర్తి తెలిపారు.



కూల్‌డ్రింక్స్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు పనులు

- అడ్డుకునే యత్నంలో వాగ్వాదం

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునే దిశగా గురువారం పనులు చేపట్టగా స్థానికులు అడ్డుకునే క్రమంలో నాయకులతో వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సబ్‌స్టేషన్ వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు ఇటీవల మట్టి పోయించారు. కాగా మట్టి పోసే క్రమంలో స్థానిక మహిళలు అడ్డుచెప్పడంతో అక్రమార్కులు రోడ్డుపైనే మట్టి పోసి వదిలేశారు. అనంతరం తాజాగా గురువారం నాడు ఓ పార్టీకి చెందిన నాయకులు సదరు మట్టిని ప్రభుత్వ స్థలంలో పోయించే పనులు చేపట్టగా వారిని స్థానిక మహిళలు నిలదీశారు. ఈ క్రమంలో సదరు నాయకులకు, స్థానికులకు నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందడంతో పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. మట్టి పనులు చేపట్టేందుకు వినియోగించిన డోజర్‌ను అధికారులు స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టగా రాజకీయ పార్టీల ఒత్తిళ్లతో వదిలేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్ మాట్లాడారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. సదరు భూమికి హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణ నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- చేతికి అందే ఎత్తులోనే..

చెన్నారావుపేట : మండలంలోని అమృతండా గ్రామ శివారులోని భోజ్యతండా దారిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. రైతు బానోత్ నర్సింహకు చెందిన మొక్కజొన్న పంట మీదుగా ఉన్న విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండడంతో వ్యవసాయ భూములకు వచ్చే, వెళ్లే రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ తీగెలు కిందికి ఉన్న క్రమంలో మొక్కజొన్న చేనుకు నీళ్లు పెట్టడానికి ఇబ్బంది పడుతున్నట్లు రైతు నర్సింహ వాపోయాడు. ఈ దారిలో ట్రాక్టర్లు ప్రయాణించే క్రమంలోనూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.



మొక్కజొన్న చేనుపై ఉన్న విద్యుత్ తీగలు

వర్క్‌షాప్‌లతో విద్యార్థుల ఉన్నతికి బాటలు

- 'బాలాజీ' చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : వర్క్‌షాప్‌లతో విద్యార్థుల ఉన్నతికి బాటలు పడతాయని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో 'పైథాన్ ప్రోగ్రామింగ్'పై ఏర్పాటు చేసిన మూడ్రోజుల శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నేర్చుకునే దిశగా విద్యార్థులకు వర్క్‌షాప్ ఉపకరించనుందని తెలిపారు. విద్యార్థులు శిక్షణను వినియోగించుకుని సాంకేతిక రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, రిసోర్స్‌పర్సన్ జాఫర్, విభాగాధిపతి శ్రవణ్‌కుమార్, డీన్ నారాయణ, విభాగాధిపతి విజయ్‌రెడ్డి, ఏఓ సురేశ్, డీన్ (స్టూడెంట్ అఫైర్స్) ఫణీంద్ర, కోఆర్డినేటర్ రాజు, ఫర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమారెమ్మ వాగు హద్దుల ఏర్పాటుకు సర్వే

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలోని నల్లమారెమ్మ వాగు హద్దుల ఏర్పాటుకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) సర్వేయర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. నల్లమారెమ్మ వాగు, పక్కనున్న రైతు భూమి హద్దుల విషయంలో కొంతకాలంగా గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్న సంగతి తెలిసిందే. సదరు రైతు ఆ భూమిలో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నాడు. గతంలో సమస్య పరిష్కారానికి ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. కాగా ఇరిగేషన్ ఈఈ హద్దులను నిర్ణయించాలని జిల్లా సర్వే విభాగం ఏడీకి లేఖ రాశారు. దీంతో గురువారం ఏడీ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. త్వరలో హద్దులు నిర్ణయించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అన్నపూజ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలోని శివలింగానికి అన్నపూజ నిర్వహించారు. తొలుత మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించి శివలింగాన్ని అన్నంతో అలంకరించారు. అర్చకులు గుమడవెల్లి ఉపేంద్రశాస్త్రి, సాత్విక్ శర్మ, వేణు శర్మ, జనార్దన్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు చందర్, రాజు, ప్రముఖులు పెద్దిరెడ్డి, కృష్ణమూర్తి, వేణుగోపాల్, సలేందర్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లి, రాయపర్తి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత మండల కేంద్రంలో ఐత ఎల్లయ్య, అనంతరం బురహాన్‌పల్లిలో పిట్టల సోమయ్య కుటుంబాలను కలిసి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు గారె నర్సయ్య, ఐత రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుధరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన పులిగిల్ల లచ్చమ్మ, వెంకన్న కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. తొలుత లచ్చమ్మ (101) మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు వేజెళ్ల కిషన్‌రావు, కాస ప్రవీణ్‌కుమార్, మౌలానా, చెల్పూరి శ్రీనివాస్, రుద్రారపు పైడయ్య, రవి, వెంకన్న, పాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

పర్వతగిరి : మండల కేంద్రంలో నేడు (శుక్రవారం) ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న తెలంగాణ అంబేడ్కర్ సంఘం మండల విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంబేడ్కర్ వాదులు పాల్గొనాలని కోరారు.

అద్దె ట్యాంకర్‌తో వేరుశనగ పంటకు నీరు

- రాష్ట్ర ప్రభుత్వంపై రైతు విమర్శలు
- సోషల్ మీడియాలో వైరల్

పర్వతగిరి : మండలంలోని సీత్యతండాకు చెందిన రామావత్ దాసు తన వ్యవసాయ భూమిలోని వేరుశనగ పంటకు అద్దె ట్యాంకర్‌తో నీరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం మీద విమర్శలు చేశాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాల్వల్లో నీరు లేకుండా పోయిందని ఆయన ఆందోళన వెలిబుచ్చాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాలిలా.. మండలంలోని సీత్యతండాకు చెందిన రైతు దాసు వేరుశనగ పంట వేశాడు. ఈ క్రమంలో స్థానిక కాల్వకు నీరు లేక పంట ఎండిపోతున్న దుస్థితి నెలకొనడంతో గత్యంతరం లేక ఇతర గ్రామ పంచాయతీకి చెందిన ట్యాంకర్‌ను అద్దెకు తీసుకుని పంటకు నీరు పెట్టుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు చేశాడు. ఆయన వ్యాఖ్యలు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ హయాంలో కాల్వల్లో నీరు పుష్కలంగా ఉండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్సారెస్పీ కాల్వల్లో చుక్క నీరు లేకుండా పోయిందని దాసు వాపోయాడు. వాటర్ ట్యాంకర్‌ను అద్దెకు తీసుకుని పంటకు నీళ్లు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చాడు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్యానించాడు.



ట్యాంకర్‌తో పంటకు నీరు పెడుతున్న రైతు

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. నర్సంపేట, వర్ధన్నపేట, ఖానాపురం, చెన్నారావుపేట, దుగ్గొండి, పర్వతగిరి, రాయపర్తి, సంగెం మండలాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సంగెంలో ఏసీపీ తిరుపతి, పర్వతగిరిలో సీఐ రాజగోపాల్ బందోబస్తును పర్యవేక్షించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పోలింగ్‌ను పరిశీలించారు.



ఖానాపురంలో ఓటరును పోలింగ్ సెంటర్‌కు తీసుకెళ్తున్న పోలీసులు



సంగెం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ



పర్వతగిరి : ఓటేసిన ఉపాధ్యాయులు

'ముస్లింల సంక్షేమానికి పెద్దపీట'

ఖిలా వరంగల్ : ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీపీసీసీ కార్యదర్శి ఎండీ ఆయూబ్, ఖాసీం షాహిద్ దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ అన్నారు. గురువారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఏకశిలా నగర్‌లోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మసీద్ నుంచి పుర వీధుల్లో జెండాను ఊరేగిస్తూ మతాలకు అతీతంగా ముస్లింలు నృత్యాలు, ఫకీర్ల విన్యాసాలు చేయగా.. సందల్ ఊరేగింపు నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు జబ్బార్ గంధం, జెండాను ఊరేగింపుగా తీసుకొస్తుండగా ముస్లింలు ఎదురేగి మొక్కలు సమర్పించుకున్నారు. ముస్లిం మతపెద్దలు మహమ్మద్ నౌమాన్ రజా సమాధికి గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా కమిటీ బాధ్యులు మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముగ్దుం, అశ్రఫ్, ఆరీఫ్, చాంద్‌పాషా, మాషూక్, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.